# మాంగల్యం తంతునానేనా...

ఈమధ్య మాంగల్యం గురించి ఒక సంఘటన జరిగితే, ఇంటికి వచ్చాక ఇంటర్నెట్లో ఈమెయిల్సుకి జవాబులు ఇస్తూ ఆ విషయమే ఆలోచిస్తున్నాను. (మాంగల్యం గురించి జరిగిన ఈ సంఘటన ఏమిటో ఓ అరడజను పేరాగ్రాఫుల తరువాత చెబుతాను)

కొన్ని దశాబ్దాల క్రితం, అంటే నేను చిన్నవాడూ చితకవాడూగా వున్నప్పుడు, చూసిన నలుపూ తెలుపు తెలుగు సినిమాలు కొన్ని గుర్తుకొచ్చాయి. సినిమాల పేర్లు గుర్తులేదు, వాటిల్లో ఎవరు నటించారో అసలు గుర్తులేదు. కాకపోతే గుర్తుండి పోయిన కొన్ని సీన్లలో ఇవి కొన్ని.

ఒక సినిమాలో హీరో దుర్మార్గుడు. రోజుకి మూడుసార్లు, అంటే ప్రొద్దున్నే ఇడ్లెన్లు తినగానే ఒకసారి, మధ్యాహ్నం భోజనం చేశాక రెండోసారి, రాత్రి భోజనానంతరం పడుకోబోయే ముందు ముచ్చటగా మూడోసారీ, డాక్టర్గారు ఇచ్చిన మాత్రలు వేసుకున్నంత ఠంచనుగా భార్యని అంటే హీరోయిన్ని చితక్కొట్టేవాడు. అతను రొటీన్గా ఒకసారి చితక్కొడుతున్నప్పుడు ఏడుస్తూ ఆమె అంటుంది 'మీరు నన్ను కొట్టండి మొట్టండి, తన్నండి గిల్లండి, చంపండి గింపండి నాకేమీ అభ్యంతరం లేదు. కానీ నా మాంగల్యం మాత్రం తెంపకండి' అని అతని కాళ్ళావేళ్ళా పడుతుంది.

చితకవాడుగా వున్న ఆ రోజుల్లోనే నాకు ఎంతో వింతగా అనిపించాయి ఆ డైలాగులు. ఎంత మూడు ముళ్ళు వేసిన మొగుడయినా, రోజుకి మూడుసార్లు చావ గొడుతుంటే ఈవిడ తనని చంపినా ఫరవాలేదు కానీ మాంగల్యం తెంపొద్దంటుంది ఏమిటి అని. అదే మా చుట్టంగారొకాయనతో అంటే 'ఏమిటా అపచారం మాటలు. నోరు మూసుకో' అని తన చెంపలు వాయించుకుని నా చెంపలు వాయించాడు.

అలాగే ఇంకో సినిమాలో ఇంకో నటి అంటుంది - 'మా ఆయన నన్ను వదిలేసి ఎవరితోనో లేచిపోయి పదేళ్ళయింది. అయినా నా మంగళసూత్రం ఎంత గట్టిగా వుందో చూడండి. ఆయన ఎక్కడున్నా క్షేమంగా వుంటే నాకదే చాలు' అంటుంది తన మంగళసూత్రాన్ని కళ్ళకద్దుకుంటూ. మొగుడి కన్నా మంగళసూత్రం ఎంత గట్టిది! హారా! అని గుంటూర్లో అనుకున్నాను.

కాసేపటికి మళ్ళీ అలాటి సీనే.

ఈసారి ఆగలేక 'శహభాష్, భారతనారీ. కలకాలం వర్ధిల్లు' అని పైకి అనబోతుంటే, ఇందాక చెప్పిన చుట్టం పక్కనే కూర్చుని చుట్ట తాగుతూ కనపడ్డాడు. చెంప తడుముకుని ఇక ఆ డైలాగులు అనటం విరమించుకున్నాను.

ఈనాటికీ చాల సినిమాల్లో పెళ్ళి ముహూర్తం అంటే మంగళసూత్రం కట్టటం అన్నట్టు చూపిస్తారు. హీరో హీరోయిన్ ఎవరికీ చెప్పకుండా, హాస్యనటుడి సహాయంతో గుడిలో పెళ్ళిచేసుకుంటూ వుంటారు. సరిగ్గా మంగళసూత్రం కట్టే

సమయానికి వస్తాడు హీరో నాన్న, లేదా హీరోయిన్ నాన్న, లేదా ఇంకో విలన్. వచ్చినవాడు ఏ ఫల్గుణుడైనా చెప్పేది ఒకే డైలాగు ఆపండి అని. పెళ్ళి ఆగిపోతుంది. అసలు పద్ధతి ప్రకారం చూస్తే పెళ్ళి అప్పటికే అయిపోయింది. ఎందుకంటే మన పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ, ఒకళ్ళ తల మీద ఒకళ్ళు జీలకర్రా బెల్లం పెట్టినప్పుడే అసలు ముహూర్తం. అది అయాకే తాళి కట్టడం, సప్తపదీ, తలంబ్రాలులాటి మిగతా తతంగం. పాపం ఎవరో ఇద్దరు ముగ్గురు తప్ప ఈనాటి మిగతా తెలుగు సినిమా దర్శకులకి ఆ మాత్రం కూడా తెలీదు. వాళ్ళననీ లాభం లేదు. పాపం వాళ్ళ జ్ఞానం అంతే మరి.

0 0 0

పోయిన శనివారం రాత్రి, కాలిఫోర్నియా సుందర్ మా వూరు వచ్చిన సందర్భంలో చిన్న పార్టీ ఇచ్చింది మాఆవిడ. ఆస్థాన మిత్రులతో పాటూ, ఇండియా నించీ కొత్తగా వచ్చిన మోహన్ వాళ్ళావిడ మోహనలని కూడా పిలిచింది.

మోహన్‌తో మాట్లాడుతున్నప్పుడు అడిగాను, ఎలా వుంది అమెరికాలో మీ సరికొత్త జీవితం అని. అతను నవ్వి 'అంతా బాగానేవుంది. అన్నిటికీ ఇప్పుడుప్పుడే అలవాటు పడుతున్నాం' అన్నాడు.

ఇక మా సంభాషణ 'అమెరికాలో మన మొదటి రోజుల' మీదకి వెళ్ళింది. అక్కడవున్న అందరూ దాదాపు ఇరవై ఏళ్ళ క్రితమో ఆ పైనో అమెరికా వచ్చినవాళ్ళే. ఆ రోజుల్లో ఎక్కడో తప్ప ఇండియన్స్ వుండేవాళ్ళు కాదు. అలాగే ఇండియన్ షాపులు. స్థానికులకి కూడా ఇండియన్స్‌ని చూస్తే కొత్తగా వుండేది. ఎవరి అనుభవాలు వాళ్ళు చెబుతున్నారు.

'మన ఇండియన్స్ దగ్గర బంగారం నగలు ఎక్కువ వుంటాయని దొంగలకి తెలుసు. అమెరికన్స్ పధ్నాలుగు కారెట్ల బంగారం వాడితే మనం 22 లేదా 24 కారెట్ల నగలు చేయించుకుంటాం కదా. విలువెక్కువ. దొంగతనాలు జరగటం ఎప్పుడో కానీ వినమనుకోండి. అయినా మన జాగ్రత్తలో మనం వుండటం మంచిది. మీ అపార్ట్‌మెంట్‌కి దగ్గరలోనే వున్న బాంక్‌లో ఒక సేఫ్టీ డిపాజిట్ బాక్స్ తీసుకోండి. నగలూ, మిగతా విలువైనవన్నీ దాంట్లో పెట్టుకోవచ్చు' అని సలహా ఇచ్చాడు సుందర్.

'అవును. పోయిన వారమే ఆ పని చేశాం. నగలన్నీ బాంకులో పెట్టేశాం' అంది మోహన.

మోహన్ అన్నాడు, 'ఇక్కడే హొరైజన్ బాంకులో ఒక లాకర్ తీసుకున్నాం. నగలన్నీ దాంట్లో పెట్టేసింది మోహన. విడ్డూరం ఏమిటంటే మంగళసూత్రం కూడా దాంట్లోనే పెట్టేసింది. నేను కొన్ని వందల మంది బంధు మిత్రుల సమక్షంలో అగ్నిసాక్షిగా కట్టిన తాళి. వద్దంటే వినదు' చెబుతున్నది సీరియస్‌గానే చెప్పాడు.

'మా ఆయనా అంతే. ఇరవై రెండేళ్ళ క్రితం నేను చేసిన అదే పనిని ఈనాటికీ దెప్పుతుంటాడు' అంది సునీత నవ్వుతూ.

సునీత భర్త సురేష్ అన్నాడు 'ఇండియాలో వున్న రోజుల్లోనే, మా సునీత పెళ్ళయిన మర్నాటినించే రాత్రి పూట నిద్రలో మెడ మీద గుచ్చుకుంటుంది అని

మంగళసూత్రం తీసి దిండు క్రింద పెట్టేది. నేనేమన్నా అంటే నాలాటి మంచి మొగుడు పక్కనే వున్నప్పుడు, ఇంకా దాంతో పనేముందనేది'

'నేనిలా అంటున్నానని ఏమీ అనుకోకండి. కానీ అది మన శాస్త్ర ప్రకారం తప్పు' అన్నాడు మోహన్.

రవి నవ్వుతూ అన్నాడు చెట్టంత మొగుడు చెంతనుండగా మంగళసూత్రం బాంకులోవుంటే తప్పేమిటండీ అని. అతని భార్య మంజుల 'అక్కడయితే నా మాంగల్యానికి భద్రత ఎక్కువ. ఇరవైనాలుగు గంటలూ విడియో కెమేరాల్లో చూస్తూ సెక్యూరిటీ వాళ్ళు వెయ్యి జూం లెన్సులతో కాపలా కాస్తుంటారు. అందుకే మా ఆయనకి ఇక ఢోకా లేదు' అని పెద్దగా నవ్వింది, రవిని కవ్వింపుగా చూస్తూ.

రవి కూడా నవ్వుతూ 'అందుకనేనా. మొన్న నాకు జలుబు చేసినప్పుడు తుమ్ములు కూడా రాలేదు' అన్నాడు.

'మనమీ విషయాలు సరదాగా చెప్పుకుంటున్నా, మోహన్‌గారు సీరియస్‌గా తీసుకుంటున్నట్టు నాకు అనిపిస్తున్నది' అంది సునీత.

'అవును నేను సీరియస్‌గా అంటున్నాను. మన సంస్కృతిలో మాంగల్యానికి చాల విలువ వుంది. అది తీసివేసేటట్టయితే అసలు కట్టటం ఎందుకు. స్త్రీకి పెళ్ళయినట్టు చెప్పే సంకేతం అదే కదా ' అన్నాడు.

రవి ఇంకా తన హాస్యధోరణిలో అన్నాడు, 'అది ఇండియాలో అనుకోండి. ఇక్కడ ఆ సంకేతం పని చెయ్యదు కదా. అమెరికన్స్‌కి అదేమిటో కూడా తెలీదు. ఈమధ్య ఇంకో గమ్మత్తు జరిగింది. ఇక్కడ మగవాళ్ళు ఆడవాళ్ళు పెళ్ళయినట్టు తెలిపే ఉంగరాలు పెట్టుకోవటం మామూలు. నా పెళ్ళి ఉంగరం మా మామగారు మద్రాస్‌లోని ఉమ్మిడియార్స్‌వారి వజ్రాలతో చేయించారు. చాల ఖరీదు. నాకూ ఉంగరం పెట్టుకుంటే వేలు దురద పెడుతుంది. అందుకే అది కూడా బాంక్ లాకర్‌లో పెట్టేసింది మంజుల. ఆ మధ్య ఏమయిందో తెలుసా, నా వేలికి ఉంగరం లేకపోతే చూసి మా ఆఫీసులో అమాండా డిన్నర్‌కి వెడదామా అని ఆహ్వానించింది. డేట్ కాదనుకో. ఆ మాట మా ఆవిడకి చెబితే, వెంటనే ఇదిగో ఈ చౌకబారు ఉంగరం తెచ్చి, నా వేలికి తగిలించింది'

హాస్య ధోరణి నించీ బయటికి వచ్చి, సీరియస్‌గా వున్న మోహన్‌తో అన్నది మంజుల.

'మోహన్‌గారూ. మీరు చెప్పింది బాగానేవుంది కానీ మనది రిట్యుయలిస్టిక్ సొసైటీ. అందుకని అసలు విషయాల కన్నా ఇలాటి సంకేతాలకీ ఆచారాలకీ విలువెక్కువ ఇస్తున్నామని అనిపిస్తుంది నాకు. మొగుడూ పెళ్ళాం సుఖంగా, సంతోషంగా వుండటం ముఖ్యం కానీ, మంగళసూత్రం మెడలో వున్నా బాంక్‌లో వున్నా దాంపత్య జీవితాలని అది శాసించదు కదూ!'

మోహన్ అంగీకరించాడో లేదో కానీ ఆలోచనలో మాత్రం పడ్డట్టున్నాడు. అందుకే ఏమీ మాట్లాడలేదు.

0 0 0